నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
శుక్రవారం
31 మే 2024
పేజీలు 8
ప్రకాశం
బాపట్ల



## 75 వ వార్షిక శ్రీ సువర్చలా హనుమజ్జయంతి కల్యాణోత్సవము



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్లలో వేంచేసియున్న శ్రీ సువర్చలాసమేత ప్రపత్తాంజనేయ స్వామి వారి దేవాలయము నందు శ్రీ సువర్చల హనుమజ్జయంతి, కల్యాణోత్సవములు ది.31-05-2024 శుక్రవారం మొదలు ది.02-06-2024 ఆదివారం వరకు జరుగును. మొదటిరోజు పంచామృత అభిషేకము,రెండవ రోజు సింధూరార్చన, మూడవరోజు స్వామి వారి కల్యాణోత్సవం, అన్న ప్రసాద వితరణ జరుగును. భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగోరుచున్నాము. మారుతి బాల భక్త సమాజం, శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం.

## యానాది ప్రజలకు కనీసవసతులు కల్పించాలి

**- యానాది హక్కుల పోరాట సమితి డిమాండ్**



బాపట్ల రూరల్,మేజర్‌న్యూస్: బాపట్ల మండలం అడవి పంచాయతి పరిధిలో ఉన్న సూర్యలంక తీరం నందు తిరువీధుల సాంబయ్య యానాది కాలనీలో యానాది హక్కుల పోరాట సమితి ప్రెసిడెంట్ తిరువీధుల శంకర ప్రసాద్ పర్యటించారు. అయన అక్కడ యానాది కుటుంబాలు త్రాగటానికి వాటర్, వీధి లైట్స్, ఇళ్ళకు కరెంట్ మీటర్స్ కూడా లేకపోవటం, రోడ్డు వసతి గాని, ఎలాంటో కనీస సౌకర్యాలు గవర్నమెంట్ ఇప్పటివరకు కల్పించకపోవడం చాలా బాధాకరమని రాష్ట్ర అధ్యక్షులు తిరువీధుల శంకర్ ప్రసాద్ అన్నారు. ఇప్పటికైనా గవర్నమెంట్ తక్షణమే కరెంట్ మీటర్స్, వీధి లైట్స్ వేయాలని, సిసి రోడ్డులు, త్రాగునీటి వసతిని తక్షణమే స్పందించి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాని కోరారు.

## ఇంజీనియస్ ఛార్మ్ వరల్డ్ రికార్డులో రేపల్లె చిన్నారి ప్రతిభ



రేపల్లె, మేజర్‌న్యూస్: ఇంజీనియస్ ఛార్మ్ వరల్డ్ రికార్డులో రేపల్లె పట్టణం 5వ వార్డు కు చెందిన ఆలా మోషే లావణ్య ల ద్వితీయ పుత్రిక అలా అమూల్య 11 సంవత్సరములు చిన్నారి ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ అందరిని ఆకట్టుకున్నారు. ఈ విద్యార్థి స్థానిక నేతాజీ మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతు ఎలక్ట్రానిక్ కీబోర్డ్ మ్యూజిక్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది.ఈ సందర్భంగా ఇంజీనియస్ ఛార్మ్ వరల్డ్ రికార్డు వారి ఆధ్వర్యంలో హెలెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు దండింగి ఆగస్టీన్ మాట్లాడుతూ చిన్నారులకు సంగీతం పట్ల మక్కువ పెంచి ఆనంద జీవితానికి మార్గాలను చూపించాలని ఆయన కోరారు. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు కళలలో కూడా ప్రతిభ కనబరిచాలనిచాలని, భవిష్యత్తులో మరిన్ని ప్రశంసా పత్రాలు అందుకోవాలని చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం ఇంజీనియస్ ఛార్మ్ వరల్డ్ రికార్డు వారి ప్రశంసా పత్రము, మెడల్ బ్యాడ్జి అలా అమూల్య కు బహుకరించారు.ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్వ్యాడికేటర్ ఆనంద్ రాజేంద్రన్, చీఫ్ ఎడిటర్ శివరాజన్ హరిరాన్,తదితరులు పాల్గొన్నారుఃకర్యాలు కల్పించాలని ప్రభుత్వాని కోరారు.

# ఎన్ డి ఆర్ ఎఫ్ సాయంతో ఆపరేషన్ పూర్తి





బాపట్ల రూరల్, మేజర్‌న్యూస్: బాపట్ల జిల్లాలో సంచలనం కలిగించిన నల్లమల వాగులో నలుగురు గల్లంతు విషయంలో సంఘటన జరిగిన రోజు రెండు మృతదేహాలు లభ్యం కాగా నిన్న రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ ఆదేశాలతో తహసిల్దార్ శ్రవణ్ కుమార్,డిఎస్పి మురళీకృష్ణ నేతృత్వంలో ఎన్డిఆర్ఎఫ్ ఎస్సై కే రామాంజనేయులు వారి బృందం రంగంలోకి దిగింది. ఇప్పటికే బాపట్ల రూరల్ పోలీసులు, బాపట్ల ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు వారి అగ్నిమాపక సిబ్బంది, గజగతగాళ్లు ప్రత్యేక బోట్లు ద్వారా ఇద్దరు కోసం గాలించి మధ్యాహ్నం వెలికి తీశారు. నందు, కిరణ్ కుటుంబ సభ్యులు నల్లమడ కాలువ వద్ద సోఖంద్రంలో మునిగిపోయారు. ప్రమాదవశాత్తు జరిగిన ఈ సంఘటన ప్రతి ఒక్కరిని ఎంతగానో బాధించింది. ఈ నేపథ్యంలో నల్లమడ వాగు ప్రదేశం లో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా కూడా వివిధ శాఖల అధికారులు సమన్వయంగా సమావేశం ఏర్పాటు చేసుకొని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు,తగు జాగ్రత్తలు తీసుకుంటారని ఆశిద్దాం. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల పొట్టి శ్రీరాములు ఏరియా వైద్యశాలకు తరలించారు.

## దర్శకరత్న దాసరి నారాయణరావు 7వ వర్ధంతి సభ




బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: చలనచిత్ర నిర్మాణంలో దర్శకుని పాత్ర ప్రాముఖ్యతల గురించి సామాన్య ప్రేక్షకునికి కూడా తెలియజేసిన ఘనత దాసరి నారాయణరావు దని మర్రి మల్యాద్రి రావు తెలియజేశారు. సాహితీ భారతి ఆధ్వర్యంలో జరిగిన దాసరి నారాయణరావు ఏడవ వర్ధంతి సభకు సాహితీ భారతి ఉపాధ్యక్షులు మర్రి మాల్యాద్రి రావు అధ్యక్షత వహించారు. దాసరి నారాయణరావు తెలుగు సినిమా రంగంలో ఒక కొత్త ఒరవడిని సృష్టించారన్నారు .ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రజా కవి వైద్య విద్వాన్ డాక్టర్ శ్రీనివాసుల శ్రీనివాస్ మాట్లాడుతూ దాసరి నారాయణరావు చక్కటి సందేశాత్మక చిత్రాలు నిర్మించారన్నారు. దాసరి తన చిత్రాలలో ఎక్కడా అసభ్యత అశ్లీలతలకు తావివ్వక సభ్యత సంస్కార భరిత చిత్రాలను నిర్మించారు అన్నారు. సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ మాట్లాడుతూ దాసరి 151 చిత్రాలకు దర్శకత్వం వహించి గిన్నిస్ బుక్ లో స్థానం సంపాదించారన్నారు. 53 చిత్రాలను నిర్మించారన్నారు. 250 చిత్రాలుకు పైగా కథ, మాటలు,పాటలు రచించారన్నారు.వారు రెండు జాతీయ చలనచిత్ర అవార్డులతో పాటు నాలుగు ఫిలింఫేర్ అవార్డులు, తొమ్మిది నంది అవార్డులతో సత్కరింపబడ్డారన్నారు. సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ మాట్లాడుతూ దాసరి జననీ జన్మ భూమిశ్చ, రవివర్మకే అందని, ఆగదూ ఆగదు, గాలి వానలో వాన నీటిలో, ఇది తొలిరాత్రి, ఓ కాలమా, ఎవరు రాయగలరు వంటి అద్భుత గీతాలు రచించి తెలుగు సినీ సాహిత్యాన్ని సుసంపన్నం చేశారన్నారు .ఈ సభలో ఎం జాకబ్ కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామ చంద్ర మూర్తి, మున్నం మస్తాన్ రెడ్డి, కీర్తి వెంకయ్య తదితరులు పాల్గొని దాసరి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం: ఎస్పీ



బాపట్ల, మేజర్‌న్యూస్: జూన్ 4 న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరుగనున్న నేపథ్యంలో ఆరోజు జిల్లాలోని బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధిలో రెడ్ జోన్ గా పరిగణిస్తూ జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఉత్తర్వులు జారీచేయడం జరిగిందని, ఆ ప్రదేశాలలో ప్రవేటు వ్యక్తు లు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వారు, ఇతరులు డ్రోన్లు ఎగరవేయటం నిషేధమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఇప్పటికే జిల్లాలో అనేక విధమైన ముందస్తు భద్రతాపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఎవరైనా నిబం ధనలు మీరి డ్రోన్లను ఎగురవేస్తే సద రు డ్రోన్లను సీజ్ చేయటంతో పాటు ఎగు రవేసిన వ్యక్తుల మీద క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరిం చారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు జిల్లా ప్రజలు, రాజకీయ నాయకులు ప్రతి ఒక్కరు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ సూచించారు

## ఫోన్ ట్యాపింగ్ కుట్ర దారులైన కేసీఆర్,జగన్ లను అరెస్టు చేయాలి



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఎన్నికల ముందు ప్రతిపక్ష పార్టీల నాయకుల ఫోన్ ట్యాపింగ్ చేసిన పోలీస్ అధికారులను వెంటనే డిస్మిస్ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి రాజీవ్ కుమార్ కు సౌత్ ఇండియన్ కాపు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పూరి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.గురువారం భట్టిప్రోలు లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అప్పటి సీఎం లుగా నున్న కేసీఆర్,జగన్ లను తక్షణం అరెస్ట్ చేయాలని శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. చంద్రబాబు,పవన్ కళ్యాణ్, పురంధేశ్వరి, రేవంత్ రెడ్డి,బండి సంజయ్ లతో పాటు 1300 మంది వరకూ ప్రతిపక్ష నేతల ఫోన్ ల ట్యాపింగ్ దేశ చరిత్ర లో పెద్ద నేరమని శ్రీనివాసరావు పేర్కొ న్నారు.ఫోన్ ట్యాపింగ్ ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని పేర్కొన్నారు.ఈ వ్యవహా రంపై సీబీఐ చే దర్యాప్తు చేఇంచాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

## బాపట్ల జిల్లా జూనియర్ రగ్బీ క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల పట్టణం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు బాపట్ల జిల్లా జూనియర్ బాలికల రగ్బీ జట్టుకు స్పోర్ట్స్ డ్రెస్ అందించిన నరేంద్ర వర్మ. విశాఖపట్నంలో నేడు, రేపు అనగా మే 31 నుంచి జూన్ 1 వరకు రాష్ట్రస్థాయి జూనియర్స్ రగ్బీ పోటీలు జరుగుతు న్నాయని బాపట్ల జిల్లా రగ్బీ సెక్రటరీ పిట్టు సుబ్బారెడ్డి బాపట్ల నియోజకవర్గ ఉమ్మడి కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ రాజు కు తెలపగా రగ్బీ పోటీలకు వెళ్లే బాలికలకు స్పోర్ట్స్ డ్రెస్ ను అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ రాజు మాట్లాడుతూ బాపట్ల జిల్లా తరపున రగ్బీ పోటీలలో పాల్గొనే బాలికలు బాగా ఆడి ప్రధమ స్థానంలో విజేతలుగా నిలవాలని ఆశించారు. ప్రస్తుత సమాజంలో బాలురతో పాటు బాలికలు కూడా అన్ని రంగాలలో ముందుండాలని ఆశిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నక్కల వెంకట స్వామి, నాగలక్ష్మి, తులసి తదితరులు పాల్గొన్నారు.

## సజ్జలకు శుభాకాంక్షలు తెలిపిన పెద్దిపోగు



బాపట్ల, మేజర్‌న్యూస్: తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారులైన సజ్జల రామకృష్ణారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు మాదిగ సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు పెద్దిపోగు కోటేశ్వరరావు, మాదిగ సంక్షేమ సంఘ రాష్ట్ర ఇన్చార్జి చిలక భాస్కర రావు, రాష్ట్ర మాదిగ సంక్షేమ సంఘ పెదకూరపాడు నియోజకవర్గ అధ్యక్షుడు కంచర్ల అచ్యుతరావు, రైతు సంఘ అధ్యక్షుడు నందిగం సుందరరావు.

## వేమవరంలో జూన్ 1న,గర్భాలయ ప్రతిష్ట



భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామపంచాయతీ శివారు వేమవరం గ్రామములో కొలువైయున్న శ్రీపాండురంగ స్వామి వారి ఆలయంలో వైశాఖ బహుళ నవమి తత్కాల దశమీలు శనివారం హనుమజ్జయంతి సందర్భముగా ఉదయం గం 7 లకు గర్భాలయ ప్రతిష్ట జరుగుతుందని దేవాలయ కార్యనిర్వహకవర్గం మరియు అర్చక స్వామి ధారా నారాయణమూర్తి గురువారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భాలయ ప్రతిష్ట అనంతరం శ్రీ సువర్చలా సహిత అభయ ఆంజనేయ స్వామి వారికి మరియు ధ్వజ స్థంభ ప్రతిష్టిత శ్రీ సువర్చలా సహిత దాసాంజనేయ స్వామి వారికి నాగవల్లి దళ,పుష్ప సహిత సిందూర సహస్ర నామ పూజ వైభవముగా నిర్వహించ బడుతుందన్నారు.ఈ స్వామివారి కార్యక్రమాలలో భక్తులు యావన్మంది పాల్గొని స్వామి వారల కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.

# ఎన్నికల ఫలితాలు ఎలా వచ్చినా స్వాగతించాలి

- అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- కౌంటింగ్ రోజు 144 సెక్షన్ అమలు
- జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ హెచ్చరిక
- రాజకీయ పార్టీల ప్రతినిధులు, గ్రామ పెద్దలతో సమావేశం



ఒంగోలు, మేజర్‌న్యూస్: త్వరలో సార్వత్రిక ఎన్నికలు కౌంటింగ్ నేపథ్యంలో తదుపరి పరిణామాలపై ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలోని పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, గ్రామ పెద్దలతో జిల్లా ఎస్పీ గురువారం ఒంగోలులోని పోలీస్ కల్యాణ మండపంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఓటింగ్ శాతం ఎక్కువగా ఉందని, కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎన్నికల్లో ఫలితాలు ఎలా వచ్చిన స్వాగతించాలని, రాజకీయ పార్టీలు గెలుపోటములను సమానంగా చూడాలని, కౌంటింగ్ తర్వాత ప్రతి ఒక్కరూ శాంతియుతంగా మెలగాలని, ఘర్షణలకు పాల్పడరాదని, గొడవలు, కొట్లాటలు, పరస్పర దాడులకు పాల్పడరాదని, ఎవరైనా ఆలా పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఎన్నికల సందర్భంగా చాలా దూర ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకునేందుకు వచ్చారని, అలాంటి వారు గొడవల్లో పాల్గొన్న రాదని, పాల్గొంటే వారిపై కేసులు నమోదు చేయటం జరుగుతుందని, ఆలా చేసిన యెడల వారి వీసా, పాస్పోర్ట్ రద్దు చేయడం జరుగుతుందని, నిరుద్యోగులు తదుపరి ఉద్యోగ అవకాశాలకు అనార్హులుగా అవుతారని తెలిపారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావించిన, ఎవరి చర్యలపైనైనా అనుమానం వచ్చిన, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా అలాంటి వ్యక్తులను బైండోవర్ చేసామని, వారిలో ఎవరైనా బైండవర్ నియమాలు ఉల్లంఘించి గొడవలు, అల్లర్లు, ఇతర నేరాల్లో పాల్గొంటే కనీసం లక్ష రూపాయల నుండి 2 లక్షల వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది లేదా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. సోషల్ మీడియా గ్రూప్స్‌లో మార్ఫింగ్ ఫోటోలు, వీడియోలు, కుల, మత, రాజకీయ పార్టీలను రెచ్చగొట్టేలా పోస్ట్ లు పెట్టడం, అవాస్తవ సమాచారమును షేర్ చేయకుండా గ్రూప్ అడ్మిన్ ముందస్తు చర్యలు తీసుకోవాలని, లేని యెడల పోస్ట్ చేసిన వారిపై అలాగే గ్రూప్ అడ్మిన్‌పై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చెడునడత కలిగిన షీట్స్ ఉన్న వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని, జిల్లావ్యాప్తంగా 247 షీట్స్ ఓపెన్ చేశామన్నారు. కౌంటింగ్ రోజు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎవరు కూడా గుంపులు, గుంపులుగా ఉండకూడదని, ఎన్నికల ఫలితాల అనంతరం ఎవరైనా విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు చేయుటకు సంబంధిత అధికారుల నుండి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, మందుగుండు సామాగ్రిని కాల్చకూడదన్నారు. వాహనాలలో ఎటువంటి ఆయుధాలు, మందుగుండు సామాగ్రి మొదలైన వాటిని కలిగి ఉండకూడదన్నారు. అభ్యర్థులకు అదనంగా సెక్యూరిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, అదేవిధంగా రాజకీయ పార్టీ ఆఫీసుల వద్ద పికెట్స్‌ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో, ముఖ్యమైన కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని, ప్రజలందరూ సంయమనంతో వ్యవహరిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ సూచించారు. కౌంటింగ్ సెంటర్ వద్ద వాహనాలు డైవర్షన్ చేయడం జరుగుతుందని, కౌంటింగ్ ఏజెంట్లు కేటాయించిన సమయం కంటే ముందుగానే ఆ ప్రదేశంలో చేరుకోవాలని, కేటాయించిన ప్రదేశంలో వాహనాలను నిలుపుకోవాలన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో ఒంగోలు సబ్ డివిజన్ ప్రత్యేక అధికారి అడిషనల్ ఎస్పీ రవి వర్మ (సిఐడి) నియమించారని, గొడవలు, అల్లర్లు, చట్టవ్యతిరేక చర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, క్రొత్త, అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే వెంటనే ప్రత్యేక అధికారి నెంబర్ 9493545764కు, స్థానిక పోలీసులకు లేదా డయల్ 112/100 కు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రవి వర్మ, ఒంగోలు డిఎస్పీ యం. కిషోర్ బాబు, సిఐడి డిఎస్పీ యం. మోహన్‌రావు, ఒంగోలు సబ్ డివిజన్ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# జిల్లాకు చేరిన 1794 సర్వీస్ ఓట్లు



ఒంగోలు, మేజర్‌న్యూస్ : జిల్లాకు 1794 సర్వీస్ ఓట్లు వచ్చాయి. ప్రకాశం భవనంలోని జిల్లా పోస్టల్ ఓటింగ్ పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ ఝున్సీ లక్ష్మి ఛాంబర్‌కు చేరాయి. వచ్చిన సర్వీస్ ఓట్లును రాజకీయ పార్టీల ప్రతినిధులకు చూపించి ఎన్ని వచ్చినయో లెక్కించి పోస్టల్ బ్యాలెట్ బాక్సలో వెయ్యటం జరిగింది. మొత్తం 6693 గాను 30 తేది గురువారం నాటికీ మొత్తం1794 ఓట్లు వచ్చాయి.

ఈ ప్రక్రియ జూన్ 4 తేది ఉదయం 8 వరకు రోజు వారిగా వచ్చిన సర్వీస్ ఓట్లను భద్రపారుస్తారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేత దామరాజు క్రాంతికుమార్, కాంగ్రెస్ రసూల్, టిడిపి స్వరూప్, బిజేపి గుర్రం సత్యం, కొండారెడ్డి, సూర్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన మెకానిక్‌కు అసోసియేషన్ ఆర్థిక సహాయం





## వైద్య ఖర్చులకు లక్షా పది వేలు అందజేత

ఒంగోలు, మేజర్‌న్యూస్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మెకానిక్ బాషాకు టు వీలర్ ఒంగోలు టూవీలర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అండగా నిలిచింది. లక్ష పది వేల రూపాయలను ఆయా కుటుంబానికి అందజేశారు. గత రెండు రోజుల క్రితం ఒంగోలు టూ వీలర్ అసోసియేషన్ సభ్యుడు బాష రోడ్డు ప్రమాదానికి గురైయ్యారు. గుంటూరులోని ఉదయ్ హాస్పిటల్‌లో వైద్యం పొందుతున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఒంగోలు టూవీలర్ ఆటో కన్సల్టెన్సీ వారు సభ్యుల తరపున కలిపి లక్ష పదివేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆటో కన్సల్టెన్సీ సభ్యులు కోటి, సుభాని, నిజాం, ఫణి, టూవీలర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దాయనేని ధర్మ, వ్యవస్థాపక అధ్యక్షులు ఆశిపల్లి, జుబేర్, రామ కృష్ణ, షేక్ బాబు, కరీముల్లా, దాసరి, మాగ్బుల్, కరుణాకర్, సహుల్, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలోని ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కనిగిరి, మేజర్‌న్యూస్: పురపాలక సంఘం పరిధిలో గల గృహా సముదాయముల వద్ద గల ఖాళీస్థలాలలో గల చిల్లచెట్లను తొలగించి తద్వారా వచ్చు రోగములను నియంత్రించుటకు, ఖాళీ స్థలముల పన్నులను వెంటనే విధించి పురపాలక సంఘ ఆర్థిక ఆదాయాన్ని పెంచాలని మునిసిపల్ కమీషనర్ టి.వి.రంగారావు అన్నారు. గురువారం కనిగిరి పురపాలక సంఘం కారయ్యాలయం నందు వార్డు అడ్మిన్లు, ప్లానింగ్ సెక్రెటరీలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ రంగారావు మాట్లాడుతూ అపరిశుభ్రంగా గల ప్రవేటు స్థల యజమానులను హెచ్చరిస్తూ పట్టణంలోని ఐదు ప్రదేశాలలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. సదరు హెచ్చరిక బోర్డునకు స్పందించి ఆర్.డబ్ల్యు.ఎస్ ప్లాంట్ తూర్పు వైపున గల స్థల యజమాని జే.సి.బి తో చెల్లచెట్లను తొలగించుకున్నారు. పట్టణ ప్రజలు వారికి సంబంధించిన ఖాళీస్థలములో గల చెట్లను తొలగించి ఖాళీస్థలం పన్నులు వేయించుకోవాలని, నూతన నిర్మాణాలకు సంబంధించి తప్పని సరిగా అనుమతులు పొంది పురపాలక సంఘము అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మేనేజర్ ప్రసాద్, టి.పి.ఓ వివేకానంద కుమార్, ఆర్.ఐ ప్రదీప్, సచివాలయ అడ్మిన్లు, ప్లానింగ్ సెక్రెటరీలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు బి.కే.పాడు విద్యార్థులు



తాళ్లూరు, మేజర్‌న్యూస్: జూనియర్ రగ్బీ టోర్నమెంట్ పోటీలు ఈ నెల 31, జూన్ 1 తేదీలలో భీమిలి (విశాఖపట్నం) రాష్ట్ర స్థాయిలో జరుగు రగ్బీ పోటీలకు ప్రకాశం జిల్లా నుండి ఈ దిగువ తెల్పిన జూనియర్ బాల బాలికలు (18 సంవత్సరాలు లోపు)వారు పాల్గొందురని వైస్ ప్రెసిడెంట్ యస్.రవి ప్రసాద రెడ్డి, కార్యదర్శి యస్.శ్రీకాంత్ గణేష్ తెలి పారు. బాలురు:. మండలంలోని బొద్దికూరపాడు గ్రామం నుండి జి.కుమార్, శివ రామకృష్ణ, పి.హేమంత్, కె.నంద కిషోర్, హుస్సేన్ బాషా, కె.మనోహర్, అర్ధవీడు నుండి కె.షాద్రక్, యు.తేజ, జె.ఇజ్రాయిల్, ఎం.రామ్ చరణ్, ఎం.అభి, వెలుగొండ నుండి ఎల్.జాన్ పాల్ పాల్గొననున్నారు. బాలికలు బొద్దికూరపాడు నుండి పి.కోమలి, పి.చందన, పి.అలేఖ్య, శిరిష, కంభం నుండి జి.సాక్షి, అఖిలశ్రీ, పి.రక్షిత, పి.అమృత పాల్గొంటారని తెలిపారు.

# టోల్ ప్లాజా వద్ద భారీ బంగారం పట్టివేత



టంగుటూరు, మేజర్‌న్యూస్: పట్టణ సమీపంలోని టోల్ ప్లాజా వద్ద గురువారం తెల్లవారుజామున సింగరాయ కొండ సిఐ రంగనాథ్ ఆధ్వర్యంలో పోలీసులు అనుమతి లేని భారీ బంగారాన్ని పట్టుకున్నారు. టంగుటూరి ఎస్సై పున్నారావు తెలిపిన ప్రకారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సింగరాయకొండ సిఐ రంగనాథ్ ఆధ్వర్యంలోని సింగరాయకొండ ఎస్సై శ్రీరామ్, టంగుటూరి ఎస్ఐ పున్నారావు అను తాను గురువారం ఉదయం టంగుటూరు టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేయుచుండగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన మేడిశెట్టి మల్లేష్, అతని భార్య ఇరువురు కలిసి చెన్నై నుండికారులో మిర్యాలగూడ కు వెళుతుండగా టంగుటూరు టోల్ ప్లాజా వద్దకు రాగానే కారును తనిఖీ చేయగా కారులో ఎలాంటి ధ్రువపత్రాలు లేని ఒక కేజీ 220 గ్రాముల బంగారంతో పాటు 58 వేలు నగదు దొరికినట్లు తెలిపారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని బంగారు విలువ సుమారు 90 లక్షలు కలిగి ఉంటుందని తెలిపారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని బంగారాన్ని నగదును స్వాధీనం చేసుకుని మేడిసెట్టి మల్లేష్ అతని భార్యను అరెస్టు చేసి వారి మీద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బంగారాన్ని, నగదును ఇన్కమ్ టాక్స్ అధికారులకు స్వాధీన పరిచినట్లు ఎస్ఐ పున్నారావు తెలిపారు.

# సింగరకొండలో హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం





అద్దంకి, మేజర్ న్యూస్ : ప్రసిద్ధి పుణ్యక్షేత్ర మైన సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో మూడు రోజులపాటు జరగనున్న హనుమజ్జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు వేదస్వస్తి మంగళవాయిద్యములతో ఆలయ ప్రదక్షిణ ఆలయ పరివార దేవతలైన శ్రీ గణపతి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర,జీవధ్వజం, ఉష్ణవాహన దేవతలకు నారికేళ ఫల సమర్పణ హారతి, 9 గంటలకు గణపతి పూజ, నవగ్రహసహిత, మన్యుసూక్తహోమం,వాస్తు మండపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన మరియు స్వామి వారికి సహస్ర నామ పూజ వైభవంగా నిర్వహించారు. 6-45 కు ప్రదోషకాలమందు సహస్ర కదళీఫల (అరటిపండ్లు) పూజ, నివేదన హారతి, మంత్ర పుష్పము నిర్వహించారు. పూజా కార్యక్రమాలన్నియు వేద పండితులు వంగల హరి శంకరావధాని నేతృత్వంలో ఘనంగా జరిపించారు. కార్యక్రమానికి ఉభయ దాతలుగా సింగరాయకొండ మండలం చిన్న కనుమల్ల గ్రామానికి చెందిన కాట్రగడ్డ మురళీకృష్ణ సౌభాగ్యం దంపతులు మరియు కాట్రగడ్డ అనిల్ కుమార్ శ్రీ విద్య దంపతులు వ్యవహరించారు. హనుమ జయంతి సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలపకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి టి సుభద్ర ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ప్రశాంత ఓట్ల లెక్కింపే లక్ష్యం

చీరాల రూరల్, మేజర్ న్యూస్: ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగే విధంగా సన్నాహాలు చేయడమే లక్ష్యమని రెండో పట్టణ సీఐ సోమశేఖర్ అన్నారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రోశయ్యకాలనీలో గురువారం సీఐ సోమశేఖర్



ఆధ్వర్యంలో పోలీసు లు కార్డెన్ అండ్ చర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సోమశేఖర్ మాట్లాడుతూ డీఎస్పీ బేతపూడి ప్రసాద్ ఆదేశాల మేరకు ప్రతి ఇంటింటిలో సోదాలు నిర్వహించి, మారణాయుధాలు ఏమైనా ఉన్నాయా అని తనిఖీలు చేశామన్నారు. శాంతి భద్రత లకు విఘాతం కల్గిస్తే ఎంతటి వారికైనా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కామ్రేడ్ మహానంద రెడ్డి సేవలు చిరస్మరణీయం

కనిగిరి, మేజర్‌న్యూస్: కామ్రేడ్ స్వర్గీయ మహానంద రెడ్డి సేవలు చిరస్మరణీయమని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.రవీంద్రబాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ యాసిన్ అన్నారు. గురువారం యేరువారిపల్లి గ్రామంలో కామ్రేడ్ మహానందారెడ్డి 23వ వర్థంతి సభ జరిగింది. అనంతరం అజీస్ పురంలో కామ్రేడ్ మహానంద రెడ్డి స్తూపం వద్ద సీనియర్ సిపిఐ నాయకులు జి.తిరుపాలు జెండా ఆవిష్కరించారు. ఏరువారిపల్లి వర్ధంతి సభలో వై.రవీంద్రబాబు మాట్లాడుతూ మహానంద రెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ ఏరువారిపల్లిలో సిపిఐ పార్టీ శాఖ ఏర్పాటు చేసి దళితులు, మైనార్టీలను, కమ్యూనిస్టు పార్టీలో చేర్పించి అంటరానితనాన్ని వ్యతిరేకించారని అన్నారు. భూపోరాటాలు చేసి భూమిలేని పేదలకు భూములు పంచారన్నారు. కామ్రేడ్ గుజ్జుల యల్లమందరెడ్డి శిష్యుడిగా పేదవారికి చదువుతో పాటు కమ్యూనిస్టు భావజాలంతో విద్యార్థులకు బోధించేవారని ఆయన సేవలు గుర్తు



చేసుకున్నారు. సిపిఐ సీనియర్ నాయకులు కొమటిగుంట్ల భీమయ్య, వై.పురుషోత్తం, జి.శివరామిరెడ్డి,అచ్చుత నరసయ్య, డి.వి.నారాయణతో కలిసి పార్టీని నడిపిన మహా నాయకుడిని కొనియాడారు. ఏరువారిపల్లి సర్పంచ్‌గా మహానంద రెడ్డి గ్రామ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. మహానంద రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి విప్లవ వందనాలు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి జి.పి.రామారావు, రైతు సంఘం నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు ఖాసిం వలి, శాఖ కార్యదర్శి ఖాసిం వలి, జడ బాలకోటయ్య, వై.ప్రభాకర్, సురేంద్ర, ప్రసాద్, అంకమ్మ, కొండమ్మ, వెలుగొండయ్య, వెలుతుర్ల మీరావలి, పుట్ట.సుబ్బారావు, షేక్ మహమ్మద్, నాయబా, పార్టీ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

## జగనన్న సంక్షేమ పాలనకు ఐదేళ్లు

**- మల్లోలు వెంకటరమణ**

భట్టిప్రోలు,మేజర్ న్యూస్ : జగనన్న సంక్షేమ పాలనకు ఐదు సంవత్సరాలు పూర్తయిందని మండలంలోని పల్లెకోన గ్రామానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లోలు వెంకటరమణ అన్నారు.జగనన్న చేపట్టిన సంక్షేమ పాలన నేటికీ ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019 మే 30వ తేదీన ఆంధ్ర రాష్ట్ర పగ్గాలను జగన్మోహన్ రెడ్డి చేపట్టారని ఆనాటి నుండి నేటి వరకు నవరత్నాలతో, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు జరిపిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అన్నారు.ఆనాటి ప్రమాణ స్వీకార వేదిక పైన వైయస్ విజయమ్మ ముఖ్యమంత్రిగా కుమారుని చూసి ఆనంద పరవశురాలై తన బిడ్డను ముద్దాడిన అదృశ్యం రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరి హృదయాన్ని తాకిందన్నారు.ఆనాటి నుండి వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పెన్షన్,విద్యా దీవెన,రైతన్నలకు, కార్మికులకు,కర్షకులకు రిక్షా కార్మికులకు,ఆటో డ్రైవర్లకు,దర్జీలకు మరియు డ్వాక్రా మహిళ పొదుపు సంఘాల ఆడపడుచులకు ఇచ్చిన హామీ ప్రకారం వారి ఖాతాల్లో నగదు జమ చేయడం జరిగిందన్నారు.జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వైసీపీ కనుకూలంగా వస్తాయని,తిరిగి 9వ తేదీన జగనన్న సీఎం గా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## నాసిక శివాజికి అభినందనలు

చీరాల, మేజర్ న్యూస్: వల్లూరు రైస్ కృష్ణ సాయి గాంధీ ఇంజనీరింగ్ కళాశాల గ్రంథ పాలకుడు అయిన నాసికి శివాజి రచించిన గ్రంథాలయ వ్యాసం అంతర్జాతీయ సమావేశం నందు స్థానం లభించిందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చీరాల పరిధిలోని దేవాంగపురి గ్రామానికి చెందిన నాసిక శివాజి రచించిన గ్రంథాలయ వ్యాసం కర్ణాటక రాష్ట్రానికి చెందిన కిలోస్కార్ ఇనిస్ట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ హరిహార్ 2024 అంతర్జాతీయ సమావేశంలో స్థానిక దక్కించుకుందని వెల్లడించారు. న్యూ ఢిల్లీ వారి ఇండియన్ లైబ్రరీ అసోసియేషన్ మరియు కిలోస్కార్ ఇనిస్ట్యూటుట్ ఆఫ్ మేనేజ్ మెంట్ ఈ నెల 24న నిర్వహించిన 2024 లైబ్రరీ మరియు సమాచారం కోసం నిర్వ హించిన లెవరింగ్ ఐసీటీ మరియు డిజిటల్ వనరులు సైన్సస్ నిపుణులు అంతర్జాతీయ సమావేశాన్ని నిర్వహించారు. సెంట్రల్ లైబ్రరీలోని ఉత్తమ అభ్యాసాల అధ్యయనం ఒంగోలు ఆంధ్రప్రదేశ్ అనే రచనకు ఉత్తమ స్థానం లభించిందన్నారు. ఈ మేరకు నాసిక శివాజీని కళాశాల గౌరవ ఛైర్మన్ శ్రీ చిన్న రంగమన్నార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కెవి సుబ్రహ్మణ్యం, డైరెక్టర్ డాక్టర్ ఏవి భాస్కర్‌రావులు తదితరులభినందించారు



## షేక్ జిలానిచే మజ్జిగ పంపిణి

చీరాల, మేజర్ న్యూస్: దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలాని ఆధ్వర్యం లో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గడియార స్థంభం సెంటర్‌లో గురువారం దళిత బహుజన పార్టీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా షేక్ జిలాని మాట్లాడుతూ మండుతున్న ఎండల్లో పాదాచారులకు ఉపశమనం కల్పించేందుకు దళజిత బహుజన పార్టీ ఆదేశాల మేరకు మజ్జిగ పంపిణీ చే శామన్నారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చల్లని తాగునీరు, మజ్జిగను పంపిణీ చేయడం ఆనందంగా ఉందని అన్నారు.

## సమస్యల పరిష్కారంలో దిట్ట

**- ఎక్కడ సమస్య ఉంటే అక్కడ ప్రత్యక్షం**

**- అవసరమైతే తానే శ్రామికుడిగా మారుతున్న కమీషనర్**

**- బాధ్యతలు చేపట్టిన కొద్ది సమయంలోనే సమస్యల పరిష్కారానికి చెక్**

**- శభాష్ కమీషనర్ అంటూ జేజేలు పలుకున్న ప్రజలు**

పొదిలి,మేజర్‌న్యూస్:సమస్యలు పరిష్కరించడంలో ఆయన దిట్ట..ఎక్కడ సమస్య ఉంటే అక్కడ ప్రత్యక్షమై సమస్యను పరిష్కరించడం ఆయన అలవాటు..పారిశుద్ధ్య కార్మికులతో కలిసి అవసరమైతే తాను కూడా ఓ



శ్రామికుడిగా మారి సమస్యను పరిష్కరించేంత వరకు నిద్రపోని బాధ్యత గల ఉద్యోగి..ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన అతి కొద్ది సమయంలోనే నగర



పంచాయతీలోని సమస్యలకు చెక్ పెట్టి అందరి చేత శభాష్ అనిపించుకున్నారు.. నగర పంచాయతీ కమీషనర్ కె చంద్రశేఖరరెడ్డి. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో




భాగంగా నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం నుండి కె చంద్రశేఖరెడ్డి పొదిలి కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.ఆయన బ్యాతలు చేపట్టిన క్షణం నుండి నగర పంచాయతీలోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు.పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పట్టణంలో కలియతిరుగుతూ మురికి కూపంగా మారిన పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.ఓ వైపు పారిశుద్ధ్యంపై ప్రజలకు ప్రత్యేక అవగాహన కలగిస్తూ మరో వైపు నిత్యం పట్టణంలో కార్మికులతో చెత్తా చెదారాలను తొలగిస్తూ క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా తయారు చేశారు.అలాగే స్థానిక పెద్ద



చెరువు అలుగు వద్ద నుండి పెద్దబస్టాండ్ బ్రిడ్జి చివరి వరకు కాల్వలో చెట్లను తొలగించి పూడికలు తీయించారు.కాటూరివారిపాలెం వద్ద నుండి మార్కాపురం అడ్డరోడ్డు వరకు రోడ్డుకు ఇరువైపులా అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి శుభ్రపరిచారు.పట్టణంలోని సైడుకాల్వల్లో మురుగు తొలగించి దోమలు వ్యాప్తి కాకుండా ఎబెట్ ద్రావణాన్ని పిచికారి చేయించారు.అంతేకాకుండా పట్టణంలో పనిచేయని బోరింగ్‌లు,డీప్‌బోర్లు,పైప్‌లైన్లకు మరామ్మత్తులు చేయించి నీటి సమస్య తలెత్తకుండా చూశారు.స్థానిక బుగ్గచలం ట్యాంక్ వద్ద పేరుకపోయిన వ్యర్థాలను తొలగించి త్వరలో పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తున్నారు.విశ్వనాథపురంలోని కాలేజ్ గ్రౌండ్‌లో వ్యర్థాలు పేరుకపోయి వాకర్స్ ఇబ్బంది పడుతున్నారనే విషయాన్ని తెలుసుకొని పారిశుద్ధ్య కార్మికులతో దగ్గరుండి శుభ్రపరిపించారు.నగర పంచాయతీ కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే నగర పంచాయతీ రూపురేఖలు మార్చిన కమీషనర్ చంద్రశేఖరరెడ్డికి ప్రజలు జేజేలు పలుకుతున్నారు.

# సంక్షేమ పథకాలే వైసీపీకి గెలుపుకు నాంది

## - మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



కనిగిరి, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో పేద ప్రజల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని ఆ పథకాలే మరలా జగన్మోహన్ రెడ్డిని ముఖ్య మంత్రిగా కొనసాగిస్తున్నాయని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టి 5 సంవత్సరములు పూర్తి అయిన సందర్భంగా మున్సిపల్ చైర్మన్ విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి ఐదు సంవత్సరాలపాటు ప్రజాక్షేత్రంలో ప్రజల కోసం పేదల అభివృద్ధి కోసం ప్రతి నిమిషం కష్టపడి పనిచేసిన దేశంలో ఎవరైనా ముఖ్యమంత్రి ఉన్నారంటే అది జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు .ఏ రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయం అభివృద్ధి అవుతుందో ఆ రాష్ట్ర అభివృద్ధి పథంలో ఉంటుంది అని నమ్మిన గొప్ప ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. రాష్ట్రంలో పేద పిల్లలు కూడా కార్పోరేట్ స్థాయి పిల్లలతో చదువుకునే విధంగా పాఠశాలలను నాడు నేడు ద్వారా అభివృద్ధి చేసి పేద విద్యార్థుల కోసం గోరుముద్ద, అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన, విద్యా వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన, ఫీజు రియంబర్స్మెంట్ ఇలాంటి పథకాలు అమలు చేసారని చెప్పారు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చారని చరిత్రలో ఎక్కడ ఎన్నడు లేనివిధంగా ఏకకాలంలో 17 వైద్య కళాశాలను మంజూరు చేసి, వెంటనే పనులు ప్రారంభించి త్వరలో పూర్తిచేసి కార్యక్రమంలో కార్యరూపం దాల్చిన గొప్ప వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు .తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద ప్రజలకు కార్పోరేట్ స్థాయిలో వైద్యం ఉండే విధంగాఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టితే తనయుడు జగన్మోహన్ రెడ్డి ఇంకొక అడుగు ముందుకు వేసి మరెన్నో జబ్బులను ఆరోగ్యశ్రీలో చేర్చారని తెలిపారు. ప్రతి గ్రామంలో ఆర్బికే కేంద్రాలను స్థాపించి రైతులకు అండగా ఉంటూ రైతు భరోసా, పంట నష్టాలకు పరిహారం ఇస్తూ రైతుల పక్షపాతిగా నిలిచారని అన్నారు. రాష్ట్రంలో వాలంటరీ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలను తీసుకరావడం జరిగిందన్నారు. కరోనా సమయంలో వైద్య ఆరోగ్య సిబ్బందిని, వైద్యుల చేత గట్టిగా పని చేయించి అలాగే నాయకులు చేత కూడా పని చేయించి, ప్రజల ప్రాణాలను కాపాడిన గొప్ప వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి మరలా జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా, అలాగే కనిగిరి శాసనసభ్యుడిగా దద్దాల నారాయణ, పార్లమెంటు సభ్యునిగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ప్రజలు గెలిపించబోతున్నారని తెలిపారు.

## అల్లర్లు, పరస్పర దాడులకు పాల్పడితే కఠిన చర్యలు

తాళ్లూరు, మేజర్‌న్యూస్: ఎన్నికల్లో ఫలితాలు ఎలా వచ్చిన దాని స్వాగతించాలని, రాజకీయ పార్టీలు గెలుపోటములను సమానంగా చూడాలని, ఎన్నికల తర్వాత గానీ, కౌంటింగ్ తర్వాత గాని, ప్రతి ఒక్కరూ



శాంతియుతంగా మెలగాలని, ఘర్షణలకు పాల్పడరాదని, గొడవలు, కొట్లాటలు, పరస్పర దాడులకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వైవీ రమణయ్య హెచ్చరించారు. జూన్ 4న జరుగనున్న సార్వత్రిక ఎన్నికలు కౌంటింగ్ నేపథ్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ లో రాజకీయ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల లెక్కింపు సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావించిన, ఎవరి చర్యలపైనైనా అనుమానం వచ్చిన, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా అలాంటి వ్యక్తులను బైండోవర్ చేశామని అని అన్నారు.

## ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

ఒంగోలు, మేజర్‌న్యూస్: సిఐటియు 54వ ఆవిర్భావం సందర్భంగా ఒంగోలు సిఐటియు కార్యాలయం నందు జండా ఆవిష్కరణ జరిగింది. జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు జండా ఎగరవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1970లో ఏర్పడిన సిఐటియు నేటి వరకు ఉద్యోగుల కార్మికుల సమస్యల పరిష్కారానికి , కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడానికి , కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ



వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సమస్యలపరిష్కారానికి పోరాటాలు చేయడంలో సిఐటియు కీలక పాత్ర వహించిందన్నారు. రాబోయే రోజుల్లో సిఐటియు జెండాలు సిఐటియు పోరాటాలు విస్తృతంగా ఉంటాయని చెప్పి సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ రిప్స్ నాయకులు చిరంజీవి, ఉదయ్ మున్సిపల్ నాయకులు ప్రసాదు కోటేశ్వరరావు, రవాణా సంఘం నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు పాపని సుబ్బారావు, ఆర్టీసీ నాయకులు అల్లడి సుబ్బారావు ,రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.శేషయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేశారు.

## విద్యార్థులు గణితంలో పట్టు సాధించాలి

దర్శి, మేజర్‌న్యూస్: విద్యార్థులు గణితంలో మంచి పట్టు సాధించాలని ఉపాధ్యాయులు కొండల రావు కోరారు. దర్శి శాఖా గ్రంథాలయం దర్శి నందు 14వ రోజు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో విద్యార్థులచే కథల చెప్పించడం, పుస్తకములు



చదివించడం, పుస్తక సమీక్ష చేయించడం, చదరంగం నేర్పించడం యోగా ఆటలు పాటలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు లెక్కల మాస్టర్ వంటి ఎం. ఏడుకొండలు పిల్లలకు మ్యాథ్స్ గురించి వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో గ్రంద పాలకురలు విజయ కుమారి పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం

ఒంగోలు, మేజర్‌న్యూస్: నగరంలోని జిల్లా గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థులతో గ్రంథాలయంలోని నీతి కథలు, పంచతంత్ర కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు మొదలగు పుస్తకాలతో పుస్తక పఠనం చేయించారు.



విరామ సమయంలో పిల్లలతో లూడో,కారమ్స్, స్నేక్ పజిల్ మొదలగు గేమ్స్ ఆడించటం జరిగింది. గణితం నందు పిల్లలకు మ్యాథ్స్ లో ఈజీ పద్ధతిలో అడిషన్, సబ్ట్రాక్షన్, మల్టీపికేషన్, డివిజన్ మరియు మొడ్యుల మొదలగు అంశాలపై పిల్లలకు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వటం జరిగింది. వేసవి విజ్ఞాన శిబిరంను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి సందర్శించారు. అనంతరం విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఐనంపూడి నరసింహం వేసవి విజ్ఞాన శిబిరంనకు హాజరైన విద్యార్థినీ, విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, సిహెచ్.సుధాకర్ రావు, యస్.షిర్డీ సాయిరాం, దాసరి లక్ష్మి ప్రసాద్, సృష్టి ఆర్ట్స్ అకాడమీ టీం టి.రవీంద్ర, టి.శిరీషా, జాలాది మోహన్ బాబు, గ్రంథాలయ సిబ్బంది డి.సందీప్, పి.ఇమ్మానుయేలు, యస్.అనిల్ బాబు, సంఘ సేవకులు నున్నా ఆంజనేయులు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య పాల్గొన్నారు.

## మల్లన్నను దర్శించుకున్న గొట్టిపాటి లక్ష్మి దంపతులు

దర్శి, మేజర్‌న్యూస్: శ్రీశైలం భ్రహ్మరంభ మల్లికార్జున స్వామిని దర్శి ఎన్.డి.ఎ కూటమి ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్



లలిత్ సాగర్ దర్శించుకున్నారు. స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అనంతపురం జిల్లా టిడిపి సీనియర్ నాయకులు జెసి ప్రభాకర్ రెడ్డి, ఆయన కుమారుడు తాడిపత్రి టిడిపి ఎమెల్యే అభ్యర్థి జె. సి అస్మిత్ రెడ్డి ని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్ సాగర్ కలశారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

## గోరంట్ల రవికుమార్‌కు టిడిపి నేతలు వివాహ దినోత్సవ శుభాకాంక్షలు

దర్శి, మేజర్‌న్యూస్: దర్శి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, హర్షిణి విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవి కుమార్‌కు పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పలువురు టిడిపి నాయకులు గోరంట్ల రవి కుమార్‌ను పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనునిత్యం నా మాట నా బాట



టిడిపి అధినేత చంద్రన్నే అంటూ నారా చంద్రబాబు నాయుడు బాటలో నడిచే గోరంట్ల రవికుమార్-కవిత దంపతులకు కు హృదయపూర్వక పెళ్లిరోజు శుభాకాంక్షలను కార్యకర్తలు తెలిపారు.అవధులు లేని ప్రేమానురాగాలతో ఆదర్శ దంపతుల వైవాహిక జీవితం ఆనందంగా సాగాలని కార్యకర్తలు కోరారు.

## జూన్ 4న గ్రామంలో 144 సెక్షన్ అమలు

గిద్దలూరు, మేజర్‌న్యూస్: సాధారణ ఎన్నికలు 2024 కౌంటింగ్ సందర్భంగా జూన్ 4వ తారీఖున మన గిద్దలూరు మండలంలోని అన్ని గ్రామాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ప్రజలు ఎవ్వరు కూడా గుంపులు గుంపులుగా ఉండడం కానీ.. బాణసంచా కాల్చడం కానీ.. వీధుల వెంట గెలుపు సంబరాలను చేసుకోవటం, రంగులు చల్లుకోవడం, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టడం వంటివి పూర్తిగా నిషేధించారన్నారు. గిద్దలూరు, పరిసర గ్రామ ప్రజలు పోలీస్ వారి సూచనను గమనించి పోలీస్ వారికి సహకరించాలన్నారు. జూన్ 4వ తేదీ నాడు



పైన తెలిపిన విధంగా కాకుండా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా గిద్దలూరు సీఐ సోమయ్య హెచ్చరించారు.

## తమ్మలూరులో కార్డన్ సెర్చ్

### - 15 వాహనాలు సీజ్ - ఎస్సై పి.ఆంజనేయులు



ముండ్లమూరు, మేజర్‌న్యూస్: మండలంలోని తమ్మలూరు గ్రామంలో ఎస్సై పి.ఆంజనేయులు, తాళ్లూరు ఎస్సై రమణయ్యలు తమ సిబ్బందితో కార్డెన్ సెర్చ్ గురువారం తెల్లవారుజామున నిర్వహించారు. కార్డెన్ సెర్చ్‌లో తమ్మలూరు గ్రామంలో ఉన్న ద్విచక్ర వాహనాలను పరిశీలించారు. ద్విచక్ర వాహనాలను తనిఖీ చేయగా 15 వాహనాలు రిజిస్ట్రేషన్ నంబర్లు లేని వాహనాలను గుర్తించినట్లు, వాటిని సీజ్ చేసినట్లు ఎస్సైలు తెలిపారు. వాహనాల తనిఖీలలో ఎస్సై పి. ఆంజనేయులు, తాళ్లూరు ఎస్సై రమణయ్య, ఏఎస్ఐలు వెంకటేశ్వర రెడ్డి, వెంకటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ మహేష్, శ్రీను పాల్గొన్నారు.

# చీమకుర్తిలో ఆంజనేయస్వామికి లక్ష తమలపాకులతో పూజలు

చీమకుర్తి, మేజర్‌న్యూస్‌ః చీమకుర్తి పట్టణంలోని శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి శ్రీరామ నామ సప్తాహ్నిక మహోత్సవాలల్లో భాగంగా ఆంజనేయస్వామికి లక్ష నాగవల్లి దళార్చన (లక్ష తమలపాకులతో) ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకొనేం దుకు భక్తులు భారీ సంఖ్యలో హాజరైనారు. ఈ సందర్బంగా ఆలయ అర్చకులు, అష్టావధాని బ్రహ్మశ్రీ ఇలపావులూరి శ్రీదర్ శర్మ మాట్లాడుతూ శ్రీరాముడి నమ్మినబంటు హనుమంతుడు బలానికి, ధైర్యానికి ప్రతి రూపం హనుమంతుని ఆరాధించడంతో ధైర్యం, స్థయిర్యం కలుగుతాయని, భయాలు, చింతలు, చిరాకులు తొలగిపోతాయని, చేపట్టే ప్రతి కార్యంలో విజయం చేకూరి, కీర్తి ప్రతిష్టలు చేకూరతాయని, నిత్యం హనుమంతుడి నామస్మరణ చేసేవారికి ఎలాంటి ఆందోళనా దరిచేరదని, ఎలప్పుడూ సుఖసంతోషాలతో జీవిస్తారన్నారు. సోమవారం సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణమును భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదములు అందజేశారు.



# పురుగు మందుతాగి మృతి

చీమకుర్తి, మేజర్‌న్యూస్‌ః ప్రేమ వ్యవహారం విషయమై గొడవ పడి మనస్థాపంచెంది పురుగు మందు తాగి బెంగుళూరుకు చెందిన ఇంపాన మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు బెంగుళూరుకు చెందిన ఇంపాన అను మహిళ అదే గ్రామానికి చెందిన చేతన్ అనే వ్యక్తితో గతంలో ప్రేమ వ్యవహారం విషయమై గొడవ పడుతున్నట్లు చేతన అనే వ్యక్తి ప్రస్తుతం చీమకుర్తిలో నివాసం ఉంటున్నట్లు, వారి ఇరువురి మధ్య ప్రేమ వ్యవహారం విషయమై గొడవ పడి మనస్థాపం చెంది పురుగుమందు తాగి చనిపోవటం వలన చీమకుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చీమకుర్తి సి.ఐ.దుర్గా ప్రసాదు తెలిపారు.

# గుర్తుతెలియని వాహనం ఢీ కొని 'రమేష్' దుర్మరణం

చీమకుర్తి, మేజర్‌న్యూస్‌ః చీమకుర్తి పట్టణంలోని ఈస్ట్ బైపాస్‌లో 30వ తేది రాత్రి 2 గంటల సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొని గుంటూరు రమేష్ (43) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు చీమకుర్తి ఇసుకవాగు సెంటర్‌కు చెందిన గుంటూరు రమేష్‌ను గుర్తు తెలియని వాహనం ఢీ కొనటం వల్ల చనిపోయినట్లు మృతుడి తండ్రి గుంటూరు రామయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సి.ఐ.దుర్గా ప్రసాదు తెలిపారు.

# నేడు యూటీఎఫ్ భవన ప్రారంభోత్సవం

చీరాల, మేజర్ న్యూస్: యూటీఎఫ్ నూతన భవన ప్రారంభోత్సవం శుక్రవారం ఘనం గా ప్రారంభిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భిక్షాలు బాలు అన్నారు. స్థానిక నూతన యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం యూటీఎఫ్ నాయకులు విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భిక్షాలు బాబు మాట్లాడుతూ గత కొన్ని యేళ్ళుగా అద్దె భవనాలతో ఇబ్బందులు పడుతున్నామని సొంత భవనం ఏర్పాటు చేయాలనే కామ్రేడ్ దాచూరి రామిరెడ్డి కల నేటితో




నెరవేరిందని గుర్తు చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి షేక్ అబ్దుల్ సత్తార్ శర్మ, పి లూకయ్యలు వంటి యూటీఎఫ్ నాయకులు చేసిన సేవలు మరవలేనివని వారి అడుగు జాడలను ఆదర్శం గా తీసుకుని పనిచేస్తున్నామన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె వీరాంజనేయుల దంపతుల చేతుల మీదుగా 2021 సంవత్సరంలో భవన నిర్మాణానికి శంఖుస్థాపన జరిగిందని గుర్తు చేశారు. యూటీఎఫ్ నాయకులు, అభిమానులు, ఉపాధ్యాయులు 475మందికి పైగా విరాళాలు అందించడంతో సుమారు రూ.70లక్ష లతో భవన నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. శుక్రవారం నిర్వహించే యూటీఎఫ్ నూతన భవన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, మాజి ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రమణ్యం, కొమ్మోజు శ్రీనివాసరావులు హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. అదే విధంగా ఎస్ఏఆర్ఆర్ఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కొమ్మూరి వీరాంజనేయులు ఉద్యోగ విరమణ మహోత్సవ సభ కూడా యూటీఎఫ్ భవనంలో ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గవిని నాగేశ్వరరావు, కె వీరాంజనేయులు, జి సూరిబాబు, పి సురేష్, పి సీతారామరాజు, సిహెచ్ వెలుగొండారెడ్డి, ఎం శ్రీనివాసులు, టి నాగమల్లేశ్వరరావు తదితరులున్నారు.

# మెనూ చార్జీలు రూ.20లు పెంచాలి

వెలిగండ్ల, మేజర్‌న్యూస్: ప్రభుత్వ పాఠశాలలో మెనూ చార్జీలు 20 రూపాయలకు పెంచాలని జిల్లా సీఐటియు కమిటీ సభ్యులు రాయల మాలకొండయ్య అన్నారు. గురువారం వెలిగండ్ల మండల కేంద్రంలో సీఐటియు ఆవిర్భావ జండా ఆవిష్కరణ జరిగిన సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ సిఐటియు యూనియన్ ఇండియాలో కలకత్తా నగరంలో 1970 మే 30న ఏర్పడి నేటికీ 54 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు కష్ట కాలంలో ఉన్న సమయంలో కూడా వారి ఉద్యోగ భద్రత, హక్కులు, వేతనాలు పెంచుకోవడం జరిగిందని, మున్ముందు అనేక సమస్యల మీద పోరాటం చేయవలసి ఉందని వారన్నారు. సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు నేటికీ 24 సంవత్సరాలు గడుస్తున్న వారికి కనీస వేతనం లేదని, ప్రస్తుతం 3000కే పరిమితం చేశారని, కనీస వేతనం నెలకు 10,000 ఇవ్వాలని, మెనూ చార్జీలు అంతంతమాత్రంగా నడుస్తున్నాయని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేసి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని ,పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించి వంట చేసేటప్పుడు అగ్నిప్రమాదానికి గురైన వారికి నష్టపరిహారం చెల్లించాలని,



మట్టి ఖర్చులు దహనసంస్కారాలకు ఇవ్వాలని, హైస్కూల్లో పనిచేస్తున్న వారికి వేతనం కూడా ఇవ్వాలని, సెలవులు ఇచ్చి వెటర్నటిబెనిఫిట్ కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించి సంవత్సరానికి రెండు జతలు యూనిఫామ్ ఇవ్వాలని, రెండు నెలలకు ఒకసారి వర్కర్లతో ఎంఈవోలు సమావేశాలు పెట్టి వారి స్థితిగతులు అధ్యయనం చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బుర్ర రత్తమ్మ, కార్మికులు సిహెచ్ యోగమ్మ, తిరుపాలమ్మ, మస్తాన్ బి, అనురాధ, లక్ష్మి, కొండమ్మ, సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

## - చీఫ్ నాగభూషణం రెడ్డి

గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికల)లో ఏర్పాటు చేసిన 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షా కేంద్రంలో



గురువారం సైన్స్ పరీక్షకు విద్యార్థులను పరీక్ష కేంద్రం వెలుపలనే క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష హాల్లోకి పంపించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గర్ల్స్ గిద్దలూరు చీఫ్ నాగభూషణ్ రెడ్డి మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించడానికి ఇన్విజిలేటర్లు సమర్థవంతంగా విధి నిర్వహణ చేస్తున్నారన్నారు. పరీక్ష కేంద్రం బయట పోలీసు సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. సెంటర్ నందు రిజిస్టర్ల మెయింటెనెన్స్ సక్రమంగా నిర్వహిస్తున్నామని చీఫ్ నాగభూషణం రెడ్డి, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ బాల గురవయ్య తెలిపారు.

# హ్యాండ్‌బ్యాగ్‌లోని బంగారు ఆభరణాలు మాయం

## – పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు

పొదిలి,మేజర్‌న్యూస్: హ్యాండ్‌బ్యాగ్‌లో ఉంచిన 13 సవర్ల 2 గ్రాముల బంగారు ఆభరణాలు మాయమైన సంఘటన గత శనివారం పట్టణంలోని పిఎన్ఆర్ కాలనీలో చోటు చేసుకుంది.స్థానిక పిఎన్ఆర్ కాలనీలో నివాసముంటున్న షేక్ షహీద్ బార్య షేక్ జరీన గత శనివారం రోజు శింగరాయకొండలో జరిగే ఒక శుభకార్యక్రమానికి హాజరవ్వడానికి వెలుతూ హ్యాండ్‌బ్యాగ్‌లో 13 సవర్ల 2 గ్రాముల బంగారు ఆభరణాలను ఉంచుకున్నారు.అయితే శింగరాయకొండ పంక్షన్‌హాల్‌కు వెళ్ళి హ్యాడ్ బ్యాగ్ చూడగా అందులోని బంగారు ఆభరణాలు మాయమయ్యాయి.దీంతో ఖంగు తిన్న బాధితులు హుటా హుటిన పొదిలికి వచ్చి తమ హ్యాండ్‌బ్యాగ్‌లోని బంగారు ఆభరణాలు మాయమయ్యాయని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# వ్యాక్సినేషన్‌ను పరిశీలించిన స్టేట్ నోడల్ ఆఫీసర్

ఉలవపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఉలవపాడు ఎస్సీ కాలనీ నందు అంగన్వాడి సెంటర్లో జరుగుతున్న అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని స్టేట్ డోనాల్డ్ ఆఫీసర్



డాక్టర్ కామే శ్వరప్రసాద్ గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ గురించి ప్రజలకు అవగాహన కల్పించి 60 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికి వ్యాక్సిన్ వేయాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ ప్రియంవద, వైద్యాధికారి కె.శ్రీనివాసులు, వైద్య సిబ్బంది లక్ష్మి నారాయణ, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# మా భూమి మాకు ఇప్పించండి సారూ...!

## - పేద మహిళా రైతు ఆవేదన

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన భూమిని మాకు ఇప్పించండి సారూ అని మండలంలోని పెదగోగులపల్లె గ్రామానికి చెందిన మహిళా రైతు బుగిడి గురవమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలకు పెదగోగులపల్లె రెవెన్యూలో సర్వేనెంబర్ 799/16లో 5.00 ఎకరాలు గతంలో సుమారు 40సంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన బుడిగి వెంకటస్వామికి ప్రభుత్వం పట్టామంజూరు చేయగా సుమారు 15సంవత్సరాల క్రితం వెంకటస్వామి చనిపోవడంతో భర్తపేరుమీద ఉన్న భూమిని భార్య బుడిగి గురవమ్మకు వర్తింపచేస్తూ చట్టం ఉన్నందున అప్పటి రెవెన్యూ అధికారులు భర్తపేరును తొలగించి భార్య అయిన బుగిడిగురవమ్మ పేరుతో నమోదు చేసినట్లు అందుకు సంబంధించి డికెపట్టా,1బి,అడంగల్ ఆధారాలు ఉన్నట్లు కాని ఇటీవల రాష్ట్రప్రభుత్వం తీసుకువచ్చిన భూముల సెటిల్మెంట్ చట్టం ప్రకారం బుగిడిగురవమ్మకు చెందిన 5.00 ఎకరాల భూమిని ఆమెకు కాకుండా అందులో 3.00 ఎకరాలు గడ్డం వెంకటనారాయణరెడ్డి అనువ్యక్తి కొనుగోలు చేసినట్లు అతని పేరు మీద తేదీ 27-04-2024 మ్యుటేషన్ ఆమోదించినట్లు మిగతా భూమి ఇతరుల కింద ఉన్నట్లు నమోదు చేశారని అమాయకురాలైన నిరుపేద కుటుంబానికి చెంది రోజువారికూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గురవమ్మకు న్యాయంచేయమని పలుమార్లు తహశీల్దార్,రెవెన్యూ సిబ్బందికి విన్నవించుకున్నా లెక్కచేయకుండా సమాధానం చెప్పడంలేదని తనకు న్యాయం చేయాలని బాధితురాలు బుగిడి గురవమ్మ ఆవేదన వ్యక్తంచేశారు.



# 10వ తరగతి యాదవ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

గిద్దలూరు, మేజర్‌న్యూస్: 10వ తరగతి పరీక్షలలో 500 మార్కులు దాటిన యాదవ విద్యార్థులకు ప్రతిభా అవార్డులను జై శ్రీకృష్ణ బీసీ సేవా సమితి, ఒంగోలు వారి ఆధ్వర్యంలో ద్రావిడ దేశం కృష్ణారావు నాయకత్వంలో ప్రతిభా పురస్కారాలను జూన్ నెలలో ఒంగోలులో మీటింగ్ ఏర్పాటు చేసి



సన్మానించనున్నారు. అందువలన ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండలాల నుంచి ప్రతి మండలంలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన ముగ్గురు విద్యార్థులకు, ప్రైవేట్ పాఠశాలలో చదివిన ముగ్గురు విద్యార్థుల చొప్పున బహుమతులు అందించనున్నారు. వివరాలను 9912914628 లేదా 9885778287 సెల్ నెంబర్లకు విద్యార్థి పేరు, సెల్ నెంబర్, గ్రామం, మండలం, హాల్ టికెట్, మార్కులను 3 రోజులల్లో వాట్సాప్ ద్వారా పంపించగలరు. ద్రావిడ దేశం కృష్ణారావు, పెరుగు మురళీకృష్ణ, ఉడతా సురేంద్రనాథ్, యన్నాబత్తిన కార్తీక్, కాకు శ్రీకాంత్, అడకా స్వాముల, రవి కిరణ్ యాదవ్, దాసరి గురు ప్రసాద్, శివరాత్రి శ్రీనివాసరావు, సురేష్ యాదవ్, బట్టు సుబ్బారావు, మొర్రి పిచ్చయ్య, ప్రెగడ శ్రీనివాస కృష్ణ తదితరులు కమిటీ సభ్యులుగా ఉన్నారు. ఈ విషయాన్ని కమిటీ సభ్యుడైన డాక్టర్ మొర్రి పిచ్చయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

# పేదరిక నిర్మూలన పై అవగాహన సదస్సు



భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: భట్టిప్రోలు మండల ప్రజా పరిషత్ సమావేశ హాలు నందు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఏపిఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ అధ్యక్షతన గురువారం ఉదయం నుండి గం 2 ల వరకు ప్రకృతి వ్యవసాయ విధానము మరియు గ్రామీ ణ పేదరిక నిర్మూలనా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జోన్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పాల్గొన్న పకృతి వ్యవసాయ విభాగం డిపిఎం అనంత కృష్ణమాచారి మాట్లాడుతూ మూడు నెలల ట్రై సోయిం గ్ లో భాగంగా 30 రకాల విత్తనాలను తొలకరి జలు లు పడుటకు ముందుగా వ్యవసాయ భూముల లో చల్లి వానిని 45 రోజుల తర్వాత భూమిలో కలియుదు న్నుట ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవచ్చునని తెలిపారు.గ్రామీణ పేదరిక సంస్థ డిస్టిక్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద లక్ష్మణాచారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయా న్ని ప్రోత్సహించుట గాను పీఎండిఎస్ కిట్లు తయారు చేయుటకు దేశవాళీ ఆవులు కొనుగోలుకు,ఎన్పిఎం షాపులు ఏర్పాటుకు స్వయం సహాయ సంఘాలు, గ్రామైక్య సంఘాలు, మండల సమైక్యల ద్వారా ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి, ఉత్సాహవంతమైన పొదుపు గ్రూపు సభ్యులకు రుణ సౌకర్యం కలిపిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీసి ఎన్ ఫ్ డిపిఎం వాణిశ్రీ,అడిషనల్ డి పి ఎం జయమోహన్,ఎన్ఎఫ్ఏ శ్రీవల్లి,క్లస్టర్ కోఆర్డినేటర్స్,మండల సమైక్య ఈసీ మెంబర్స్,బాల పాప, మరియు పకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఐలవరంలో హనుమాన్ శోభా యాత్ర



భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామంలో వేంచేసి యున్న శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న హనుమాన్ జన్మదిన వేడు కలు లలో భాగంగా గురువారం హనుమాన్ శోభా యా త్ర నిర్వహించారు. ఆంజనేయ స్వామికి,ప్రధాన అర్చకు లు దీవి రఘునాథ చక్రవర్తి నేతృత్వంలో మాచర్ల యజ్ఞ నారాయణ దంపతుల చే పూజా కార్యక్రమం నిర్వహిం చారు.అనంతరం కౌతరపు శివ శంకర సిద్దాంతి భజన బృందం చే భజన సంకీర్తనలు ఆలపించారు. ఈకార్యక్ర మంలో గుద్దంటి జగన్,మాచర్ల రామచంద్రరావు కౌతరపు సుబ్రహ్మణ్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జార్జ్ కళాశాలలో ఘనంగా జాబ్ అచీవర్స్ డే



మార్కాపురం, మేజర్‌న్యూస్: స్థానిక జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్‌జిఐటి పాలిటెక్నిక్ నందు జాబ్ అచీవర్స్ డే కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించడం జరి గింది. ఈ సందర్భంగా ఈ సంవత్సరం 2023-24 వివిధ కంపెనీల ద్వారా ఎంపికైన డిప్లొమా ఈసీఈ, ట్రిబుల్ ఈ, మెకానికల్, సివిల్ విభాగానికి ఎస్‌జిఐటి కళాశాల పాలి టెక్నిక్ విద్యార్థిని, విద్యార్థులకు జాబ్ ఆఫర్ లెటర్స్ అంది ంచడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల కార్య దర్శి ఆదిమూలపు విశాల్ విద్యార్థులను అభినం దిస్తూ విద్యా ర్థుల ఉజ్వల భవిష్యత్తుకై తగిన సూచనలు అంది ంచా రు. ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రాజబాబు మాట్లాడు తూ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ చేసిన వారిలో 50 మంది డిప్లొమా స్టూడెంట్స్ కు ఉద్యోగాలు వచ్చాయి అని తెలి యచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రాజబాబు, డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎం.మస్తాన య్య, ట్రైనింగ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ డి. కుమార్, వివిధ విభాగా ధిపతులు, డిప్లొమా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొ న్నారు.

## శాఖ గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం



మార్కాపురం, మేజర్‌న్యూస్: పట్టణంలోని స్థానిక శాఖ గ్రంధాలయం, నందు గురువారం వేసవి విజ్ఞాన శిబి రంను నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో విద్యార్థులచే కథలు చెప్పించడం, పుస్తకములు చదివిం చడం, పుస్తక సమీక్ష చేయించడం, చదరంగం నేర్పిం చడం, బ్రైన్ గేమ్స్ ఆడించటం జరిగినది. ఈ కార్యక్ర మంకు డాక్టర్ యం.శేషుకుమార్ హెచ్ఓడి ఫిజిక్స్, సాధనా డిగ్రీ కళాశాల విద్యార్థులకు గణితంలో త్రికోణ మితి ద్వార ఎత్తును ఎలా కొలవటం దాని ప్రాముఖ్యత తెలియచేయుట, పాటలు పాడుట నేర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కొల్లి విజయలక్ష్మి విద్యార్థు లచే ఆటలు ఆడించుట జరిగినది. ఈ కార్యక్రమంలో ఒ.రవిశేఖర్ రెడ్డి విద్యార్థులకు చదరంగం నేర్పించుట జరిగినది. ఈ కార్యక్రమం గ్రంథాలయ గ్రేడ్ వన్ గ్రంథపాలకులు జీవి శివారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.

## నాదస్వర విద్వాంసుడు ధూళిపూడి రామచంద్రయ్య మృతి



నగరం, మేజర్‌న్యూస్: నాదస్వర విద్వాం సుడు, సువర్ణహ స్తాఘంట కంకణ బిరుదాం కితుడు ధూళిపూడి రామచంద్ర య్య (80) కన్నుమూశారు. ఈయనకు బ్రెయిన్ స్ట్రోక్ రావటంతో రేపల్లెలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెం దారు. మండల పరిధిలోని బెల్లంవారిపాలెం గ్రామానికి చెందిన రామచంద్రయ్య ఉల్లిపా లెంలోని శ్రీ చెన్నమల్లేశ్వర, శ్రీచెన్నకేశ వస్వామివార్ల దేవస్థానం, ధూళిపూడిలోని శ్రీ వేణుగోపాలస్వామివారి దేవస్థానంలో ఆస్థాన విద్వాంసులుగా కొంతకాలం పనిచేశారు. ఈయన నిజాంపట్నం మండలం, ముత్తుపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన పండితారాధ్యాలు, సంకీర్తనాచార్యులు శ్రీమాన్ తిరువేంగళం వద్ద సంగీతాన్ని నేర్చుకొని, అనంతరం నాదస్వర విద్య కోసం తిరుచ్చె, తంజావూరు, తమిళనాడు రాష్ట్రంలోని సద్గురువర్యులు టివి శివసుబ్రహ్మణ్యం వద్ద కాంభోజ, శంకరాభరణ త్యాగరాజస్వామి వద్ద పంచరత్న కీర్తనలు నేర్చుకున్నారు. తనకిష్టమైన కళ్యా ణిరాగాన్ని శుభప్రదమైన తల్లిరాగంతో ఎన్నో మండపాల్లో నాదనీరాజనాలు సమర్పిస్తూ, స్వరాభిషేకం చేస్తూ భరతముని శాస్త్రంలో దిట్ట అయ్యారు. నాగిని వాయించే సమ యం లో పలువురు తన్మయశోభితమై తాదా త్మ్య ము చెందుతారు. తాను నేర్చుకున్న సంగీతం సమాజ అభివృద్ధికి, సమష్టి జనానికి తెలియ జేయటమే లక్ష్యంగా బెల్లంవారిపాలెంలో త్యాగరాజ సంగీత పాఠశాలను స్థాపించారు. ఫలితంగా వివిధ వాయిద్యాలలో నాదస్వరం, వాయులీనం, ఫిడేలు, మాండోలిన్, గిటార్, పియానో, క్యాషియో, కీబోర్డు, క్లారినెట్‌లాంటి వాయిద్యాలలో సుమారు 600 మందికి పైగా శిష్యులను తయారు చేశారు. ఇటీవల రేపల్లె శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆయన శిష్య బృందం రామచం ద్రయ్యను ఘనంగా సత్కరించారు. నేటి యువత రామచం ద్రయ్యకు ఆదర్శంగా నిలుస్తారని ప్రతి ఒక్కరూ ఆశిద్దాం.

## ఐటీ కోర్ బృందంతో సామాజిక మధ్యమాలపై నిఘా తస్మాత్ జాగ్రత్త

బాపట్ల, మేజర్‌న్యూస్: 2024 సార్వత్రిక ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదలైన తరువాత వాట్సాప్/టెలిగ్రామ్/ఫేస్ బుక్/ఇన్స్టాగ్రాం, ఇతర గ్రూపులలో ప్రజలను రెచ్చగొట్టే సందేశాలు, ఫోటోలు పోస్టు చెయ్యరాదని, ఎవరైనా పోస్ట్ చేస్తే సంబంధిత గ్రూప్ అడ్మిన్ లే పూర్తి బాధ్యత వహించవలసి వస్తుందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదల కానున్న నేపథ్యంలో జిల్లాలో ఏటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలలో భాగంగా జిల్లా ఐటీ కోర్ విభాగంలో నిష్ణాతులైన పోలీస్ అధికారులు, సిబ్బందితో సామాజిక మాధ్యమాలపై నిఘా ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదలైన తరువాత సోషల్ మీడియాలో ప్రజలను, ఇతర రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలను, అభ్యర్థులను రెచ్చగొట్టే విధంగా సందేశాలు, ఫోటోలు పోస్టు చేయరాదని, ఎవరైనా వాట్సాప్/టెలిగ్రామ్/ఫేస్ బుక్/ఇన్స్టాగ్రాం, ఇతర సోషల్ మీడియా గ్రూపులలో అభ్యంతరకర పోస్టులు పంపితే దానికి గ్రూప్ అడ్మిన్ బాధ్యత వహించవలసి వస్తుందని ఎస్పీ తెలిపారు. కనక గ్రూప్ అడ్మిన్ లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఎవరైనా గ్రూప్ లలో ఇతరులను కించపరిచే విధంగా అభ్యంతరకర పోస్టులు పంపితే వాటిని వెంటనే డిలీట్ చేసి, పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.సామాజిక మాధ్యమాలలో అభ్యంతరకర, రెచ్చగొట్టే విధంగా సందేశాలు, ఫోటోలు ఎవరైనా పోస్ట్ చేస్తే వెంటనే స్థానిక పోలీసులకు (లేదా) బాపట్ల జిల్లా ఎస్పీ హెల్ప్ లైన్ నెంబర్ 8333813228 కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ ప్రజలకు సూచించారు.

# ఘనంగా సీఐటీయు ఆవిర్భావ దినోత్సవం



దొనకొండ, మేజర్‌న్యూస్: శ్రామికుల జీవన ప్రమాణాల కోసం వారి హక్కుల కోసం ఉద్యమాలు చేస్తున్న కార్మిక సంఘం సిఐటియు అని దొనకొండ మండల సిఐటియు కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అన్నారు. సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సివిల్ సప్లై గోడౌన్ వద్ద సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రకాశం జిల్లా సిఐటియు అధ్యక్షులు తాండవ రంగారావు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు కార్మిక రంగంలో వస్తున్న పెను సవాలను అధిగమించేందుకు ఐక్య ఉద్యమాలకు సారథ్యం వహిస్తూ సంఘటిత అసంఘటిత కార్మికుల పక్షాన నిలబడి విలువైన విజయాలు సాధించారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై గోడౌన్ ముఠా కార్మికులు, సిఐటియు మండల నాయకులు కర్ణ హనుమయ్య, కుందుర్తి అనిల్, మారెళ్ళ వెంకటేశ్వర్లు కోటేశ్వరరావు, గుడిమెట్ల ఆదాం తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవ మహా సభలు



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల పట్టణంలోని స్థానిక పదోవార్డు ప్యాడి సన్ పేట సంఘూస్థులు, యూత్ ఆధ్వర్య ంలో 5,6,7 వా తారీఖులలో క్రైస్తవ మహా సభలు నిర్వహించుచున్నట్లు పాడిసన్ పేట సంఘుస్థులు తెలియజేశారు.ఈ క్రైస్తవ మహాసభలకు సంబంధించిన కర్ర పత్రాన్ని గురువారం ప్యాడిసన్ గ్రౌండ్స్ నందు సి. బి. జడ్ చర్చి సంఘ కాపరి పవిత్ర కుమార్ చేతుల మీదుగా ఆవిష్క రణ చేశారు. జూన్ నెల లో జరగబోయే క్రైస్తవ మహాసభలకు ప్రతి ఒక్కరు పాల్గొనాలని సంఘుస్తులు పిలుపుని చ్చారు. ఈ మహాసభల కోసం ఎంతగానో కృషి చేస్తున్న ప్యాడిసన్ పేట యువకుల ను సంఘూస్థులు అభినందనలు తెలి పారు. ఈ కార్యక్రమంలో సంఘుస్థులు, సంఘ పెద్దలు, యూత్,పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కౌన్సిలింగ్ వాయిదా




బాపట్ల, మేజర్‌న్యూస్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ది. 03-06-2024 న జరగవలసిన పాలిటెక్నిక్ కౌన్సిలింగ్ 06-06-2024 నకు వాయిదా వేయడం జరిగినదని బాపట్ల కౌన్సిలింగ్ సెంటర్ కోఆర్డినేటర్ టి. రాజేంద్రప్రసాద్ విలేక రుల సమావేశంలో తెలియజేశారు. ఆప్ష న్స ప్రక్రియ 07-06-2024 నుండి 10-06-2024 వరకు జరుగుతుందని,11-06-2024 న ఆప్షన్స్ మార్చుకోవచ్చు నని,13-06-2024 న సీటు అలాట్మెంట్ జరుగుతుందని, విద్యార్థులందరూ ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. ప్రిన్సిపాల్, టి. రాజేంద్రప్రసాద్ బాపట్ల పాలిటెక్నిక్ బాపట్ల.

# చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



దొనకొండ, మేజర్‌న్యూస్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4వ తేదీన ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలా పాల కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని దొనకొండ ఎస్సై ఎల్.సంపత్ కుమార్ తెలిపారు సావిత్రి ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమల్లో ఉందని ఎవ రు కూడా ఎన్నికల నిబంధనలు అతిక్ర మించి గెలుపు సంబరాలు చేసిన బాణాసంచా కాల్చిన సోషల్ మీడి యాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టరాదని దొన కొండ మండల, పరిసర గ్రామ ప్రజలకు పోలీసు వారు తెలియజేశారు. అటువంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు.



## చంద్రబాబును కలిసిన మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాఘవరెడ్డి

ఒంగోలు, మేజర్‌న్యూస్: మాజీ ముఖ్య మంత్రి, తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్ర బాబు నాయుడుని ఒంగోలు పార్లమెంట్ అభ్యర్ధి మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆయన తనయుడు మాగుంట రాఘవరెడ్డిలు కలిశారు. గురువారం హైద రాబాద్‌లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పలు విషయాలు మాట్లాడుకున్నారు.



# రౌండ్ల వారీగా ఫలితాలు వెల్లడి

**– రైజ్‌లో కౌంటింగ్ ప్రక్రియ పనులను పరిశీలించిన కలెక్టర్ దినేష్ కుమార్**





ఒంగోలు, మేజర్‌న్యూస్: కౌంటింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసేందుకు, ఫలితాలను రౌండ్లు వారీగా ఎప్పటికప్పుడు ఈ.సి.ఐ.కి, మీడియాకు తెలియజేసేందుకు చేస్తున్న ఏర్పాట్లలో ఎలాంటి లోపము ఉండకూడదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ.ఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. గురువారం ఆయన ఓట్ల లెక్కింపు కేంద్రమైన ఒంగోలు శివారులోని రైజ్ ఇంజనీరింగ్ కాలేజీని సందర్శించారు. కౌంటింగ్ దృష్ట్యా పూర్తి కావస్తున్న ఏర్పాట్లను ఆయా నియోజకవర్గాల వారీగా కలెక్టర్ పరిశీలించారు. ఓట్ల లెక్కింపునకు అనుగుణంగా టేబుళ్లు, వివారాలను ఎప్పటికప్పుడు నమోదు చేసేందుకు కంప్యూటర్ల ఏర్పాట్లు, కౌంటింగ్ గదిలోకి సిబ్బంది, ఏజెంట్లు ప్రవేశించేలా వేరు వేరుగా బ్యారికేడ్ల ఏర్పాటు, కౌంటింగ్ గదిలో జరిగే ప్రక్రియను మొత్తం వివిధ కోణాలలో పర్యవేక్షించేలా సి.సి కెమెరాల ఏర్పాటు తదితర అంశాలను ఆయన ప్రత్యేకంగా పరిశీలించి సంబంధిత ఆర్.ఓలకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వి.వి ప్యాట్ స్లిప్పులను లెక్కించేందుకు కూడా అవసరమైన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బంది, ఏజెంట్లకు స్నాక్స్, భోజనం వంటి సదుపా యాలను సంబంధిత ఫ్లోర్‌లోనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ దిశగా ఏర్పాట్లు చేయడంతో పాటు అన్ని ఫ్లోర్ లలోని టాయిలెట్లను శుభ్రంచేయించేలా చర్య లు తీసుకోవాలని అధికారులను ఆదేశిం చారు. ఈ సందర్భంగా ఆయన వెంట సంతనూతల పాడు ఆర్.ఓ. అయిన జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, మార్కాపురం ఆర్.ఓ. అయిన రాహుల్ మీనా, డి.ఆర్.ఓ ఆర్.శ్రీలత, పోస్టల్ బ్యాలెట్ల నోడల్ ఆఫీసర్ విశ్వేశ్వరరావు, ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్.ఓ.లు ఉన్నారు.

## జిజిహెచ్‌లో డైట్ కాంట్రాక్టర్ తొలగింపు: నూతన కాంట్రాక్టర్‌కు అప్పగింత

ఒంగోలు, మేజర్‌న్యూస్ : జిజిహెచ్ లో ప్రస్తుతం డైట్ సప్లయ్ చేస్తున్న కాంట్రాక్టర్ అను మెస్ అండ్ బేకరీస్ వారిని టెర్మినేటర్ చేసి తదుపరి వరుసలో ఉన్న శ్రీ వేంకటేశ్వర అసోసియేషన్ వారికి అప్పగించునట్టు జిజిహెచ్ సూపరిండెంట్ డా. దుర్గాదేవి తెలిపారు. కాంట్రాక్టర్ పై వచ్చిన ఫిర్యాదులను పూర్తి స్థాయిలో విచారించిన తరువాత డైట్ కమిటీ సిఫార్సు మేరకు ప్రస్తుతం డైట్ కాంట్రాక్టర్ ను తొలగించామని తెలిపారు. ఈ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళమని వారి సూచనల మేరకు రేపటి నుంచి శుక్రవారం నుంచి నూతన కాంట్రాక్టర్ ద్వారా పేషంట్లకు భోజనం అందచేస్తారు అని అన్నారు. భోజనం నాణ్యత, సరఫరా విషయంలో రాజి పడేది లేదని, నూతన కాంట్రాక్టర్‌కు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశామన్నారు.

కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేదన్నది అవాస్తవం అన్నారు. ప్రభుత్వం నుంచి బడ్జెట్ కేటాయించారని, పాత కాంట్రాక్టర్‌తో పాటు సదరు అను మెస్ బేకరి వారికి కూడా నిబంధనల ప్రకారం బిల్లులు ఇచ్చామని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మాత్రమే డైట్ సరఫరా, నాణ్యతలో లోపం ఉందని సూపరిండెంట్ డా. దుర్గా దేవి తెలిపారు.








## అంజిరెడ్డి మృతి టిడిపికి తీరని లోటు

### - ఫోన్‌లో పరామర్శించిన డాక్టర్ లలిత్ సాగర్



ముండ్లమూరు, మేజర్‌న్యూస్: మండలంలోని టిడిపి నాయ కులు గజ్జెల అంజిరెడ్డి మృతి టిడిపికి తీరని లోటు అని దర్శి నియోజకవర్గం రైతు సంఘం అధ్యక్షులు మేదర మెట్ల మెట్ల వెంకట రావు అన్నారు. అంజిరెడ్డి అనారోగ్యం కారణంతో గురువారం ఉదయం మృతి చెందారు. అంజిరెడ్డి టిడిపి నాయకుడిగా, పోలవరం గ్రామ పాల ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షులుగా పనిచేశారని తెలిపారు. దర్శి ఎన్.డి.ఎ కూటమి ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ లలిత్ సాగర్ ఫోన్ లో వారి కుటుంబ సభ్యులు ప్రగాఢ సానుభూతి ని తెలిపారు. అంజిరెడ్డి మృత దేహాని కంభం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెమల దిన్నె చెన్నారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ మళ్ళేకార్జున, టిడిపి నాయకులు రావేళ్ల నరసయ్య, మున్నంగి యేసు రత్నం పరామర్శించి నివాళ్ళు అర్పించారు.

## బాబా మందిరం వార్షికోత్సవం

ముండ్లమూరు, మేజర్‌న్యూస్: మండలంలోని పోలవరం గ్రామంలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరా వార్షికోత్సవం గురువారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా ప్రత్యేక భక్తి కార్యక్రమం లను నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. సాయిబాబా దేవాలయం వద్ద నుండి ఊరిగింపు కార్యక్రమం మొదలు అయ్యి కార్యక్రమం ప్రదేశం కు చేరుతుంది అన్నారు. 6 గంటలకు దుప హారతి, బాబాకు పుష్ప అభిషేకం, పూజ్య గురువులు అమ్ముల సాంబశివరావు సతస్యంగా ప్రసంగం టివిలో ప్రసారం చేశారు. 31న ఉదయం కాకడ హారతి, సుప్రభాతం, బాబా అభిషేకములు, బాబాకు చందోనిత్సవాహం పూజ కార్యక్రమం లు నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు. బాబా చిత్రపటాన్ని గ్రామ పుర వీధులలో ఊరేగించారు. బాబామందిర వార్షికోత్సవ సందర్భంగా దేవాలయను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలకరించారు.

## అవాంఛనీయ సంఘటనలు జరిగితే కఠిన శిక్ష : ఎస్సై పులి శివ నాగరాజు



హనుమంతునిపాడు, మేజర్ న్యూస్: మండల పరిధిలో 20 24 కౌంటింగ్ సందర్భంగా జూన్ 4వ తారీఖున మన హనుమంతునిపాడు మండలం లోని అన్ని గ్రామాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ప్రజలు ఎవ్వరు కూడా గుంపులు గుంపులుగా ఉండడం కానీ.. బాణసంచా కాల్చడం కానీ.. వీధుల వెంట గెలుపు సంబరాలను చేసుకోవటం, రంగులు జల్లుకోవడం, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టడం వంటివి పూర్తిగా నిషేధించడమైనది. హనుమంతునిపాడు మరియు పరిసర గ్రామ ప్రజలు పోలీస్ వారి సూచనను గమనించి పోలీస్ వారికి సహకరించవలసిందిగా ఎస్సై పులి శివ నాగరాజు తెలియజేశారు. జూన్ 4వ తేదీ నాడు పైన తెలిపిన విధంగా కాకుండా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## కౌంటింగ్ సెంటర్ వద్ద నియమావళిపాటించాలి

బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల డి.ఎస్.పి కార్యాలయం నందు నిర్వహించిన పత్రికా సమావేశంలో బాపట్ల డిఎస్పి సిహెచ్ మురళీకృష్ణ కౌంటింగ్ రోజు అమలు చేయనున్న నియమ నిబంధన గురించి వివరించారు.04.06.2024 వ తేదీన జరుగుచున్న ఎన్నికల కౌంటింగ్ డే సందర్భంగా, 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉన్నందున ప్రజలకు, పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెం ట్లు, అందరూ బాపట్ల పట్టణంలో ఆ రోజులలో ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనములు దారి మళ్లింపులుకు ప్రజలు అందరూ సహకరించవలిసిందిగా పోలీసు వారి విజ్ఞప్తి. 04.06.20024 వ తేదీన కౌంటింగ్ సందర్భంగా ప్రజలు అందరూ ఆరోజు, తరువాత రోజు కూడా ప్రశాంత వాతావరణం లో ఉండి (శాంతిని కలిగి) ఎటువంటి గలాటాలు లేకుండా వారి ఇంటి వద్దనే ఉండాలి. దయచేసి అబ్యర్థులు వారి ఏజెంట్లు తప్ప ఎవరిని మీ నియోజకవర్గంల నుండి తీసుకుని రాకూడదు. కౌంటింగ్ సెంటర్ లోపలకు ఏజెంట్లు ఫారం - 18,గుర్తింపు కార్డు కలిగి ఉన్నవారిని మాత్రమే అనుమతించబడును.

# వ్యవసాయ కళాశాల 79 వ వార్షిక దినోత్సవ వేడుకలు







బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల వ్యవసాయ కళాశాలలో విద్యనభ్యసించిన అనంతరం విద్యార్థులు ఉద్యోగార్థం విదేశాలకు వెళ్లి స్థిరపడినా ఈ ఊరితో ఆ విద్యార్థులకు అనుబంధం ఏనాటికీ చెక్కుచెదరదని, ఇక్కడి విద్యా విషయక జ్ఞానపరిమళాలు విద్యార్థులకు నేర్పించే ఉత్తమ సంస్కారం అందుకు కారణమని విశ్రాంత ఐ.ఏ.ఎస్. అధికారి, త్రిపుర ప్రభుత్వ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, కళాశాల పూర్వ విద్యార్థి డా.జి.ఎస్.జి. అయ్యంగార్ అన్నారు. వ్యవసాయ కళాశాల 79 వ వార్షికోత్సవ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ కళాశాలలో విద్యనభ్యసించిన అనేక మంది వివిధ రాష్ట్రాలలో ఐ.ఏ.ఎస్.అధికారులుగాను, శాస్త్రవేత్తలుగాను రాణిస్తున్నారని, ఇక్కడి అధ్యాపకుల నాణ్యమైన బోధన, వారు నిర్వహించే విలువలతో కూడిన క్రమశిక్షణా విధానాల ద్వారా విద్యార్థులు అటు వంటి లక్ష్యాలకు చేరుకోగలుగుతున్నారన్నారు. ప్రస్తు తం విద్యార్థుల కంటే విద్యార్థినులు అధిక సంఖ్యలో వ్యవసాయ విద్య పట్ల మొగ్గు చూపడం శుభపరి ణామమని, బాపట్ల కళాశాల ఆ ఘనతను సాధించి ఇతర కళాశాలలకు ఆదర్శనీయంగా నిలిచిందన్నారు. విద్యానంతరం పట్టాలు పుచ్చుకుని వెళ్ళిన పూర్వ విద్యార్థులు తమకు ఉన్నత విద్యను అందించిన తమ కళాశాల పట్ల కృతజ్ఞతా భావనతో ఉండాలని, తమ వంతు సేవను కూడా ఈ కళాశాలకు అందించాలని ఆయన కోరారు. కళాశాల పూర్వ విద్యార్థిగా కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారాన్ని ఎప్పుడూ అంది స్తూనే ఉంటానని, విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉం చుకుని వసతి గృహాల ఏర్పాటులో పూర్తి సహకారాన్ని అందిస్తానన్నారు. సభకు అధ్యక్షత వహించిన డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డా.కరుణ సాగర్ విద్యలోనే కాక క్రీడల్లోనూ, సాహిత్య సాంస్కృతిక పోటీల్లోనూ కళాశాల ఉన్నత స్థాయి చేరుకోవడాన్ని అభినందిస్తూ ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ కెరీర్ పట్ల మరింత శ్రద్ధ వహించవలసిన అవసరం ఉందన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డా. వి. శ్రీనివాస రావు కళాశాల అభివృద్ధి నివేదికను సమర్పిస్తూ 74 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయబడిన ఈ కళాశాల ద్వారా 4.4 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం విద్యార్థులకు స్కాలర్షిప్పులు రూపంలో అందజేయబడ్డాయని, ఉద్యోగాల కల్పనలో విద్యార్థులకు కళాశాల అండగా ఉంటుందన్నారు. గ్రామ దత్తత కార్యక్రమం ద్వారా గ్రామీణాభివృద్ధికి పాటుపడటమేకాక, రైతు సదస్సులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ కాన్ఫరెన్సులు నిర్వహిస్తున్నామని, జాతీయ సేవ పథకం మరియు ఎన్.సి.సి. ద్వారా పలు సేవ కార్యక్రమాలు చేబడుతున్నామన్నారు. సౌర విద్యుత్తును వినియోగించడమే కాక విద్యార్థినుల తల్లిదండ్రుల కోసం పేరెంట్స్ హోమ్ కూడా ఏర్పాటు చేయబడిందన్నారు. డీన్ ఆఫ్ పి.జి. స్టడీస్ డా. ఏ. వి. రమణ మాట్లాడుతూ ఎం.ఎస్. స్వామినాథన్, కురియన్ మరియు వినాయక్ కట్టర్ వంటి శాస్త్రవేత్తల జీవిత చరిత్రలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.విద్యార్థుల ప్రతిభాపాటవాలకు నిదర్శనంగా నిలిచే హరిత పత్రికను ముఖ్య అతిధి ఆవిష్కరించగా సీనియర్ ప్రొఫెసర్లు డా.టి. మధుమతి, డా. డి.సాయిరాం కుమార్ అవార్డులు మరియు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. డా.పి.వెంకట సుబ్బయ్య వందన సమర్పణ చేశారు.

## ఘనంగా శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య కళ్యాణ మహోత్సవం





వేటపాలెం, మేజర్‌న్యూస్: మండలంలోని రామన్నపేటలో కొలువై యున్న శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల కళ్యాణం బ్రహ్మశ్రీ నాగార్జున శాస్త్రి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన వారు దేవన ప్రసాద్ ధర్మపత్నం లక్ష్మి గురువారం ఉదయం జరిగిన ఈ కళ్యాణంలో దేవన మార్కండేయులు ధర్మవతి లక్ష్మీ గోపయ్య స్వామి వారిని పెళ్లి కుమారునిగా అలంకరించగా, ఉమ్మిటి నాగ వెంకట శివ శంకరరావు ధర్మపత్ని రాజేశ్వరి శ్రీ తిరుపతమ్మను పెళ్లి కుమార్తెగా అలంకరించారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. అదేవిధంగా సాయంత్రం శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల నగరోత్సవం మంగళ వాయిద్యములతో, బాణాసంచాలతోకనక తప్పట్లతో, జై వీరాంజనేయ యువజన కోలాట కర్ర సాము సమాజం వారిచే కోలాట ప్రదర్శన జరిగినది. ఈ కార్యక్రమంలో విగ్రహ దాతలు ఐలా సాంబశివరావు ధర్మపత్ని విజయలక్ష్మి, లీల సోమశేఖర రావు (కోలాట గురువు దేశ పేట ), తాడిపత్రి విగ్నేశ్వర రావు (ట్రూఫ్ ఆర్గనైజర్ దేశాయిపేట ), పింజల బాలసుబ్రమణ్యం (గాయకులు పందెళ్ల పల్లి), కారంచేటి వీరాంజనేయ శర్మ ధర్మపత్ని నిర్మల దేవి, శ్రీ లక్ష్మి తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల మందిర కమిటీ కమిటీ, భక్తులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో అన్నదమ్ముల మధ్య ఘర్షణ, ఒకరు మృతి

- పోలీసుల అదుపులో నిందితుడు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన దర్శి సీఐ షమీముల్లా, ఎస్ఐ ఆంజనేయులు





ముండ్లమూరు, మేజర్‌న్యూస్: క్షణిక ఆవేశము ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న సంఘటన మండలంలోని సుంకరవారిపాలెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన వ్యక్తి తాళ్లూరు మండలంలోని గుంటి గంగ వద్ద అమ్మవారికి పొంగళ్ళు నిర్వహించి గ్రామస్థులను ఆహ్వానించారు. ఆగ్రా మస్తు లు కూడా వెళ్లారు. అక్కడ భోజనం చేసి తమ గ్రామానికి చేరుకున్నారు. ఆటో దిగేవద్ద చిన్న పాటి గొడవ అయ్యింది. గ్రామానికి చెందిన మద్యం మత్తులో ఇరువురు అన్నదమ్ములు ఘర్షణ పడ్డారు. మద్యం మత్తులో వరసకు అన్నను రాయి తీసుకొవేయగా అక్కడిక్కడే మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం ఆ గ్రామానికి చెందిన అన్నదమ్ముల పిల్లలు నల్లబోతుల పెద్ద వెంకటేశ్వర్లు, నల్లబోతుల బ్రహ్మయ్య గురువారం తాళ్లూరు మండలం గుంటి గంగమ్మ అమ్మవారి వద్ద మొక్కులు తీర్చుకునేందుకు వెళ్లి మద్యం సేవించారు. కార్యక్రమాలు పూర్తి చేసుకొని స్వగ్రామైన సుంకరవారిపాలెంకి ఆటోలో బయలు దేరి వచ్చారు. ఆటో దిగే సమయం లో ఇరువురు మధ్యలో స్వల్ప వివాదం జరిగింది. వారు ఇరువురు చెట్టు కింద కూర్చొని ఇరువురి మధ్య మత్తులో మాటకు మాట పెరిగి నల్లబోతుల బ్రహ్మయ్య ను నల్లబోతుల పెద్ద వెంకటేశ్వర్లు రాయితో తలపైకి విసిరాడు. దీనితో బ్రహ్మయ్య(56) అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారి సమాచారం మేరకు సీఐ ఎస్.కె షమీముల్లా, ఎస్సై పి.ఆంజనేయులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతి చెందిన నల్లబోతుల బ్రహ్మయ్యకు భార్య పిల్లలు ఉన్నారు. భర్త మృతితో భార్యాపిల్లలు, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. ఆయన మృతితో సుం కరవారిపాలెం గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

## శ్రీ షిరిడిసాయిబాబా పంచమ వార్షికోత్సవం



తర్లుపాడు, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురు వారం ట్రస్ట్ చైర్మన్ మాదాల మల్లికా ర్జున్ రిటైర్డ్ తహసిల్దార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక గ్రామంలోని భక్తులతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి సాయిబాబా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరిం చుకొని పూజారి అలుగుపల్లి బాల బ్రహ్మం శాస్త్రవేత్తంగా పూజలు, అభిషేకా లునిర్వహించారు. కార్యక్రమం అనం తరం కొందరు దాతలు సహకారంతో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్విఘ్నంగా కొనసాగింది. అనంతరం సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు సాయిబాబా పల్లకి సేవ కార్యక్రమం పురవీధులలో భక్తుల కోలహాలు మధ్యఅంగరంగవైభవంగాసాయిబాబాను స్మరించుకుంటూ కార్యక్రమం కొనసాగిం ది. దీంతో గ్రామంలో ప్రజల ందరూ సాయిబాబాను కన్నుల విందుగా కొలు చుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మాదాల మల్లికార్జున, కమిటీ సభ్యులు మాదాల శంకర్, మాదాల కోటేశ్వరరావు, నెహ్రూ యూత్ మండల అధ్యక్షుడు బెద్దూరి పుల్లయ్య, రిటైర్డ్ ఎంఈఓ ఎన్సీ.కృష్ణారెడ్డి, కుందూరు పెద్దకాశిరెడ్డి, కొప్పుల కాశిరెడ్డి, కుందూ రు చిన్న కాశిరెడ్డి, కే.నారాయణ రెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.